RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 64 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 13 డిసెంబర్ 2024

# సరస్వతి పవర్ భూములు వెనక్కి



- ప్రభుత్వం ఉత్తర్వులు!
- మాజీ సీఎం జగన్‌కు షాక్..
- అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ సర్కార్ నిర్ణయం
- మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి :డిప్యూటీ సీఎం ఆదేశాలతో మాచవరానికి చెందిన సరస్వతి పవర్ అసైన్డ్ భూముల పరిశీలనరెవన్యూ అధికారుల నివేదిక అనంతరం కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కూటమి ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. సరస్వతి పవర్ అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా 2లో

# జమిలికి ఆమోదం




## 'వన్ నేషన్ - వన్ ఎలెక్షన్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

- మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం



న్యూ ఢిల్లీ ఆంధ్ర ప్రగతి: జమిలి ఎన్నికల(వన్ నేషన్ - వన్ ఎలెక్షన్)కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమిలికి ఆమోదముద్ర వేసింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. దేశంలో వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండటం... దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందని ఎన్డీయే ప్రభుత్వం తొలి నుంచి వాదిస్తున్న సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 18,626 పేజీల నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసింది.

మిగతా 2లో

# ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే విద్యుత్, నీళ్ల సరఫరా కట్

పోలీస్ అధికారులను ఆదేశించిన హైకోర్టు



2లో

# పారిశ్రామికవేత్తలకు మనో ధైర్యం కల్పించండి

## కలెక్టర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం

- ఉద్యోగాల కల్పన చాలా ప్రధానమైన అంశం
- రైతులను భాగస్వాములను చేయండి.
- అంతిమ లబ్ధిదారులుగా వారుండేలా ప్రోత్సహించాలి
- గతంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే
- పారిశ్రామికవేత్తలు భయపడ్డారు.
- ఇప్పుడు ఆ పరిస్థితి పోగొట్టి మళ్లీ అనుకూల
- వాతావరణం కల్పించాలి.



అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి: ప్రతి జిల్లాలో ఎన్ని ఉద్యోగాలు కల్పించామనేది ప్రాతిపదికగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా రెండో రోజు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆ శాఖ ప్రగతిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.. 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి జిల్లాలోనూ ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయి? వచ్చిన పెట్టుబడుల ద్వారా ఎన్ని ఉద్యోగాలు కల్పించామనే అంశాలపై దృష్టిపెట్టాలన్నారు.

మిగతా 2లో




# జీరో డ్రాపవుట్స్, ఎన్ రోల్ మెంట్ పై దృష్టి సారించాలి

- ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు: నారా లోకేశ్
- అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సమావేశం
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- మధ్యాహ్న భోజనం, హాస్టల్ మెస్ నాణ్యతకు చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ

2లో


# ఏపీ కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు భగ్గు..!



2లో



గ్రంధి శ్రీనివాస్



అవంతి శ్రీనివాస్


# వైసీపీకి డబుల్ షాక్

- మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ గ్రంధి శ్రీనివాస్ రాజీనామా
- తప్పు తెలుసుకోవాలంటూ జగన్ కు సూచన!
- జగన్ కు రాజీనామా లేఖను పంపిన అవంతి శ్రీనివాస్
- ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని జగన్ కు హితవు
- వైసీపీలో కార్యకర్తలు నలిగిపోయారని ఆవేదన

2లో

# నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం...

- మానవ వనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నాలెడ్జి సొసైటీ లక్ష్యానికి లోబడి విద్యావ్యవస్థలో మార్పులు చేయాలి
- అంతర్జాతీయ విద్యాసంస్థలకు దీటుగా కరిక్యులమ్ లో మార్పులు
- కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్దేశం



అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి: నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం... ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. మానవ వనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాల ద్వారా అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తేవాలి. ప్రైవేటు విద్యావ్యవస్థను తొక్కేయడం మన విధానం కాదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయం. రాబోయే రోజుల్లో నాలెడ్జి ఎకానమీలో తెలుగు విద్యార్థులు నెం.1గా నిలవాలి. మిగతాది 2లో...

# పిన్నవయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించిన గుకేశ్

- చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించి ఘనత సాధించిన గుకేశ్
- 18 ఏళ్లకే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారతీయుడు
- ఈ క్షణం కోసం పదేళ్లుగా ఎదురు చూస్తున్నానన్న గుకేశ్



2లో

# జమిలికి ఆమోదం

(మొదటి పేజి తరువాయి)
జమిలి ఎన్నికల బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం ముద్ర వేసింది.. ఈ మేరకు గురువారం మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై పార్లమెంట్ ముందుకు చర్చకు రానుంది. దేశంలో వేరువేరుగా ఎన్నికల నిర్వహణ.. దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందంటూ కేంద్రంలోని బీజేపీ మొదటి నుంచి వాదిస్తోంది.కాగా, రాబోయే సాధారణ ఎన్నికలు.. జమిలిగానే జరపాలని ప్రధాని నరేంద్ర మోదీ కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకోసం వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. కానీ, పార్లమెంటులో రాజ్యాంగ సవరణలకు కూటమికి అవసరమైన సంఖ్యా బలం లేదు. అయినా ఈ బిల్లు ఆమోదించుకునేందుకు ముందుకెళ్లాలని మోదీ భావిస్తున్నారు. ముందుగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెడతారు.కోవింద్ కమిటి సిఫార్సులకు అనుగుణంగా..జమిలి ఎన్నికలపై గతంలోనే కోవింద్ కమిటి 18,626 పేజీల ఈ నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. 2023, సెప్టెంబర్ 2 ఈ నివేదిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. పలువురు నిపుణుల సారధ్యంలో 191రోజుల కసరత్తు అనంతరం ఈ నివేదికను పూర్తిచేశారు. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని, తరువాతి 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ ఈ నివేదికలో సిఫారసు చేసింది.కోవింద్ కమిటీ తన నివేదికలో ఏకకాలంలో ఓటు వేయడం దేశప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో సహాయ పడుతుందని పేర్కొంది. ఒకేసారి ఐక్యంగా ఓటు వేయడం అనేది అభివృద్ధి ప్రక్రియను, సామాజిక ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రజాస్వామ్య పునాదిని మరింత బలోపేతం చేస్తుందని తెలిపింది. ఏకకాలంలో ఓటింగ్ జరగడం వల్ల పారదర్శకత, సౌలభ్యం, ఓటరు విశ్వాసం గణనీయంగా పెరుగుతుందని కోవింద్ కమిటీ భావించింది.ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలు, సిబ్బంది, భద్రతా దళాల ముందస్తు ప్రణాళికను ఈ కమిటీ సిఫారసు చేసింది. తొలిసారిగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు ఉండవచ్చని నివేదిక పేర్కొంది. హంగ్ హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం జరిగితే, మిగిలిన ఐదేళ్ల కాలానికి తాజా ఎన్నికలు నిర్వహించవచ్చని కోవింద్ కమిటీ పేర్కొంది.

# ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే విద్యుత్, నీళ్ల సరఫరా కట్

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి:
ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే ఇళ్లకు విద్యుత్, నీళ్ల సరఫరా కట్ చేయాలని హైకోర్టు పోలీస్ అధికారులను ఆదేశించింది. హెల్మెట్ ధరించని కారణంగా కేవలం మూడు నెలల వ్యవధిలోనే 600 మందికి పైగా చనిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చట్టాలు నిబంధనలను కఠినంగా అమలు చేస్తే ఎలాంటి పరిస్థితులు రావని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సీరియస్ అయింది.ఏపిలో రోడ్డు ప్రమాదాలలో మరణంచిన వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుంటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానా విధించడం లేదంటూ న్యాయవాది యోగేష్ వేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు అధికారుల నిర్లక్ష్య పోకడలను ఎత్తి చూపింది.

ఎవరైనా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపితే గనుక కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. ఒకవేళ పెండింగ్‌లో ఉన్న చలానాలు కట్టకపోతే వారి ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరా నిలిపేయాలని సూచించింది. వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయడం లేదని, ఇక ఏపీ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాల డ్రైవర్లు తెలంగాణ సరిహద్దుకు వెళ్ళగానే సీట్ బెల్ట్ పెట్టుకుంటున్నారని, కానీ ఏపీలో మాత్రం నిబంధనలను ఎవరూ పాటించడం లేదని పిటిషన్ పేర్కొన్నారు.అద్దాలకు నల్ల ఫిలిమ్ ఉన్న కార్లు హైదరాబాద్‌లో కనిపించవు. కానీ ఇక్కడ ఎక్కువగా కనిపిస్తున్నాయని ఇందుకు చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయకపోవడమే కారణం అంటూ పిటిషన్ వేసిన న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రభుత్వం వైపు తరపు న్యాయవాది చలాన్లు, తనిఖీలు అన్ని చేస్తున్నామని సమాధానం చెప్పినప్పటికీ, జరిగిన ఘటనల్లో హెల్మెట్ లేకుండా చనిపోయిన వారే చాలామంది ఉన్నారని హైకోర్టు దృష్టికి రావడంతో ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది. హైకోర్టు హెల్మెట్ తప్పనిసరి చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన జూన్ 26 నుండి సెప్టెంబర్ 4 మధ్య 666 మంది చనిపోవడం చిన్న విషయం ఏమీ కాదంటూ ఏపీ హైకోర్టు సీరియస్ అయింది. హెల్మెట్ లేకుండా ఎవరు కనిపించిన ఉపేక్షించొద్దంటూ ఆదేశాలు ఇచ్చింది. పోలీసులు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని లేని పక్షంలో మరణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని కేవలం మూడు నెలల్లో ఇన్ని మరణాలు ఎలా అంటూ ప్రశ్నించింది. చలానాలు చెల్లించుకుంటే వాహనాలు సీజ్ చేసేందుకు చట్ట నిబంధనలు వెసులుబాటు కల్పిస్తున్నప్పటికీ అలా చేయకుండా ఎవరు ఆపారంటూ ఆర్టీఏ అధికారులను సైతం హైకోర్టు ప్రశ్నించింది.

అధిక జరిమానాలు విధించడం వల్ల సమస్యకు పరిష్కారం దొరక్కపోగా సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకు ప్రస్తుతం విధిస్తున్న జరిమానాలనే కఠినంగా అమలు చేస్తే సరిపోతుందని హైకోర్టు సూచించింది. తదుపరి విచారణలో ట్రాఫిక్ ఐజీని హైకోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. ఇప్పటివరకు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేశారు. యాక్సిడెంట్స్ కాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది.

# పారిశ్రామికవేత్తలకు మనో ధైర్యం కల్పించండి

(మొదటి పేజి తరువాయి)
ప్రతి జిల్లా కలెక్టరు రాబోయే కలెక్టర్ల సదస్సుకు దీనిపైన స్పష్టమైన వివరాలతో రావాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి జిల్లాలో నిర్వహించాల్సిన సమావేశాల పట్ల కలెక్టర్లు శ్రద్ధకబరచకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చిత్తూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు అసలు ఒక్క సమావేశం నిర్వహించకపోవడం సరికాదన్నారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ పనులు వేగవంతంగా చేయాలన్నారు.

జిల్లాల్లో పరిశ్రమలు నెలకొల్పడంలో, భూసేకరణలో రైతులను భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులందరరూ కలిసి తమ భూములను ఒక ఇండస్ట్రియల్ పార్కుగా వారే అభివృద్ధి చేసుకుంటామని ముందుకొస్తే వారికి ప్రోత్సాహమివ్వాలని, రైతుల నుంచి పరిశ్రమల కొరకు భూములు సేకరించాల్సి వచ్చినప్పుడు వారిని భాగస్వాములను చేసి అంతిమంగా భూములిచ్చిన రైతులు ఎక్కువ లబ్ది పొందేలా కలెక్టర్లు వ్యవహరించాలన్నారు. దీనికి అమరావతి రాజధానికి చేపట్టిన భూ సేకరణను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయడంలో అదికారులు, జిల్లా కలెక్టర్లు ఎంతమాత్రం జాప్యం ప్రదర్శించకూడదన్నారు. జాప్యం జరిగితే ఒక్కోసారి మనవద్ద పెట్టుబడి పెట్టడానికి వచ్చిన పరిశ్రమలు వెళ్లిపోయే ప్రమాదముంటుంది. కొన్ని పెద్ద, పెద్ద పరిశ్రమల స్థాపన ప్రతిపాదనలకు అనుమతులు ఆరు నెలలు, సంవత్సరం ఆలస్యమైతే కొన్నిసార్లు ఆ ప్రాజెక్టే సాధ్యం కాకుండా పోయే ప్రమాదముంటుందన్నారు.

గతంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే పారిశ్రామివేత్తలు బయపడే పరిస్థితులు నెలకొన్న విషయాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. పరిశ్రమ పెట్టడానికి వచ్చిన వారిని గత ప్రభుత్వంలో బెదిరించారు. వారిని ఇబ్బందుల పాలు చేశారు. కొంతమంది పరిశ్రమలు పెట్టినవారు భయపడి పొరుగు రాష్ట్రాలకు పారిపోయారు. వారు పోతూ పోతూ మేం ఇక జన్మలో ఏపీలో పెట్టుబడులు పెట్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ వెళ్లిన రోజులున్నాయని సీఎం చెప్పారు. ఇప్పుడిప్పుడే పరిస్థితిని గాడిలో పెడుతున్నాం. పెట్టుబడులు పెట్టడానికి ఏపీలో అనుకూల వాతావరణం కల్పిస్తున్నాం. అలాంటి అనుకూల వాతావరణాన్ని పునర్నిమించేందుకు జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలన్నారు.జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన భూ సేకరణకు సంబంధించి జిల్లా కలెక్టర్లదే కీలకపాత్ర అని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని దీనికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని కోరారు. ప్రతి కుటుంబానికో పారిశ్రామికవేత్త అనే నినాదంతో ప్రభుత్వం ముందుకెళుతోందని, దీనిని సాధిండంలో భాగంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలపై సర్వే చేస్తున్నామని, అది జిల్లాల్లో సవ్యంగా జరిగేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలున్నాయని, అలాగే 34 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయన్నారు. దీనిపైన క్షేత్రస్థాయిలో సర్వే సరిగ్గా జరిగేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఐటీ పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనికి సంబంధించి భూములు గుర్తించడానికి కలెక్టర్లు పనిచేయాలన్నారు. విశాఖపట్నంలోని మధురవాడ, కాపులుప్పాడలో 200 ఎకరాల్లో ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నామని, దీనికి సంబంధించిన స్థలాన్ని గుర్తించాలన్నారు. అలాగే మంగళగిరిలో ఐటీ పార్కు ఏర్పాటుకు కావాల్సిన 200 ఎకరాల స్థలం గుర్తించాలన్నారు. కడపలోని కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నామన్నారు. అలాగే తిరుపతిలో కూడా ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్ కొరకు 500 ఎకరాల స్థలం గుర్తించే అంశంపైనా ఆ జిల్లా కలెక్టరు ప్రయత్నించాలని కోరారు. అలాగే తిరుపతి నగర పరిధిలో ఐటీ పార్కు ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం కావాలన్నారు

# జీరో డ్రాపవుట్స్, ఎన్ రోల్ మెంట్ పై దృష్టి సారించాలి

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి:
గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని, రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలు, ఫలితాలపై దృష్టిసారించి ఏపీ మోడల్ విద్యావ్యవస్థ రూపకల్పనకు అధికారులంతా నడుంబిగించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మానవవనరుల శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ పెరగాలని, జీరో డ్రాపవుట్స్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



“ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు. పారదర్శకమైన విధానాలతో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు, ఎకడమిక్ పెర్ఫార్మెన్స్ ను పొందుపరుస్తూ జిల్లాలవారీగా ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అందజేస్తున్నాం. రాబోయే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించాలి. పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం లోకల్ మెనూతో మధ్యాహ్న భోజనం అందించే వెసులుబాటును కలెక్టర్లకు కల్పించాం. ఉన్నత విద్యలో కూడా హాస్టల్, భోజన సౌకర్యాలపై దృష్టిపెట్టాలి.

ఇటీవల కాలంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రతివారం విద్యార్థులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధానాన్ని చేపట్టాం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా మెస్, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.

పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈగల్ టీమ్స్, క్లబ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి. కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనను చర్యలు చేపడుతున్నాం.

అపార్ ఐడీ విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. సాంకేతిక సమస్యలు అధిగమించి పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులంతా కృషిచేయాలి” అని మంత్రి లోకేశ్ కోరారు.

# నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం...

(మొదటి పేజి తరువాయి)
అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రత్యేక బృందాలను పంపి అక్కడ బోధన, అభ్యసన పద్ధతులపై అధ్యయనం చేయాలి. తదనుగుణంగా కరిక్యులమ్ లో మార్పులు చేసి, ఎన్ఐఆర్ఎఫ్, గ్లోబల్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. సివిల్ ఏవియేషన్, గ్రీన్ ఎనర్జీ, టూరిజం రంగాల్లో భవిష్యత్ అవకాశాలను అంచనావేసి ఆయా యూనివర్సిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. స్కిల్స్, ఎంప్లాయ్ మెంట్ ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంది. ఇందుకోసం అమరావతి రాజధానిలో ఏర్పాటుచేసే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో రాష్ట్రంలోని 5 జోన్లలోని స్కిల్ డెవలప్ మెంట్ సంస్థలను అనుసంధానిస్తాం. డిజిటల్ టీచింగ్, లెర్నింగ్ పై దృష్టి సారించాలి. సొసైటీ అవసరాలను బట్టి స్కిల్ అప్ గ్రేడేషన్ చేపట్టాలి. ఒకేషనల్ విద్యపై దృష్టిసారించాలి. పాఠశాలల్లో రేటింగ్ మెరుగుదలకు కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో ర్యాంకింగ్స్ మెరుగుదలకు కృషిచేసి, విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులంతా కృషిచేయాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తిచేశారు.

# ఏపీ కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు భగ్గు..!

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 12: ఏపీసీసీ వైఎస్ షర్మిలపై సొంత పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు జోరుగా ప్రచారం నడుస్తోంది. ఆమె వ్యవహార శైలిపై సీనియర్ నాయకులు తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారపార్టీ తీసుకుంటున్న నిర్ణయాలపై పోరాటం చేయాల్సిన షర్మిల.. కేవలం తన అన్న జగన్ ను మాత్రమే టార్గెట్ చేయడంపై పలువురు కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.ఈ మేరకు షర్మిల తన కుటుంబం, వ్యక్తిగత వివాదాల వరకే పరిమితమయ్యారని సోషల్ మీడియా పోస్టులు, ప్రెస్ మీట్లలో మాట్లాడిన తీరు స్పష్టంగాఅర్థంమవుతోందంటున్నారు. పీసీసీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి చంద్రబాబు సర్కార్పై చేసిన విమర్శల కంటే జగన్ పై చేసిన ఆరోపణలే ఎక్కువగా ఉన్నాయని మండిపడుతున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు, లోక్ సభ మాజీ సభ్యుడు జీవీ హర్షకుమార్ డైరెక్టు షర్మిలను ఉద్దేశించి సంచలన ఆరోపణలు చేశారు. జాతీయ పార్టీకి నాయకత్వం వహిస్తున్నప్పటికీ ఆమె కుటుంబ వివాదాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నయ్య మీదే ఆమె టార్గెట్. అతనిపై విమర్శలు చేస్తే చాలు. పార్టీ, రాష్ట్రం ఎలా పోయినా అనవసరం’అన్న రీతిగా అన్న చందంగా షర్మిల తీరు ఉందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# వైసీపీకి డబుల్ షాక్

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి:
అధికారాన్ని కోల్పోయిన వైసీపీకి భారీ షాకులు తగులుతున్నాయి. ఆ పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ ఈరోజు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అవంతి రాజీనామా చేసిన కాసేపటికే మరో కీలక నేత పార్టీని వీడారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్ కు పంపించారు. కీలక నేతలు వరుసగా పార్టీని వీడుతుండటంతో వైసీపీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి.జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడించిన ఘనత గ్రంధి శ్రీనివాస్ కు ఉంది. 2019 ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేసిన పవన్ పై ఆయన విజయం సాధించారు. తద్వారా పార్టీలో జెయింట్ కిల్లర్ గా గుర్తింపు పొందారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రంధి శ్రీనివాస్ ఏ పార్టీలో చేరుతారనే విషయంపై ఇంకా క్లారిటీ రాలేదు.

వైసీపీ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్, ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా మీడియాతో అవంతి మాట్లాడుతూ... పార్టీ అధ్యక్షుడు జగన్ పై విమర్శలు గుప్పించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే... ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వానికి కనీసం ఒక ఏడాది సమయం ఇవ్వాలని చెప్పారు. ఐదు నెలల సమయం కూడా ఇవ్వకుండానే ధర్నాలు చేయాలంటే ఎలాగని ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ గౌరవించాలని అవంతి అన్నారు. ఐదేళ్లు పాలించాలని కూటమికి ప్రజలు అవకాశం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఎన్నో పథకాలను అమలు చేసి కూడా... ఎన్నికల్లో ఓడిపోయామంటే... తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలని చెప్పారు. పార్టీ అనేది ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని అన్నారు. వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తలంతా నలిగిపోయారని చెప్పారు. తాడేపల్లిలో కూర్చొని జగన్ ఆదేశాలు ఇస్తుంటారని... క్షేత్రస్థాయిలో ఇబ్బంది పడేది కార్యకర్తలని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీలో కార్యకర్తలకు గౌరవం లేదని విమర్శించారు.

# సరస్వతి పవర్ భూములు వెనక్కి

(మొదటి పేజి తరువాయి)
ఇటీవల వైఎస్ జగన్, ఆయన సోదరి షర్మిల, తల్లి విజయమ్మ ఆస్తుల వివాదం కోర్టుకు చేరింది. దాంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు జగన్ తాలూకు మాచవరానికి చెందిన సరస్వతి పవర్ అసైన్డ్ భూములను పరిశీలించారు. ఈ సంస్థకు చెందిన భూములపై ఆరా తీయాల్సిందిగా అధికారులను పవన్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ రికార్డులను అధికారులు చెక్ చేశారు.

మాచవరం ఎంఆర్ఓ క్షమారాణి, వీఆర్ఓ అఖిల్, ఆర్ఐ కోటేశ్వరరావు, సర్వేయర్ సాల్మన్ రాజు, దాచేపల్లి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కే విజయలక్ష్మి, బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, మనోజ్.. సరస్వతి సిమెంట్, పవర్ భూములను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా మాచవరం మండలంలోని 17.69 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

# పిన్నవయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించిన గుకేశ్



భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో 18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లలో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యానన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు.

# జనని నూతన ఆసుపత్రి ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ.!

## -గైనకాలజీ నిపుణురాలు డాక్టర్ లావణ్య దేవి ఆధ్వర్యంలో వైద్య సేవలు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 12:
పద్మావతి నగర్ లో గైనకాలజీ నిపుణురాలు డాక్టర్ లావణ్య దేవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జనని నూతన ఆసుపత్రిని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ ప్రారంభించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శి డాక్టర్ పనీల్, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, మహిళా విభాగం నాయకులు డాక్టర్ వసుధ, డాక్టర్ నర్మద,డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ కార్తీకి ఆసుపత్రిలోని ఓపిడి, ఆపరేషన్ థియేటర్, వార్డు, ల్యాబ్, ఫార్మసీ, స్పెషల్ రూముల బ్లాక్ లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ నంద్యాలలో అన్ని విభాగాల వైద్య నిపుణులు ఇప్పుడు అందుబాటులో ఉన్నారని, డాక్టర్ లావణ్య దేవి జనని ఆసుపత్రి ద్వారా ఆధునిక వసతులతో ప్రసూతి, గైనకాలజీ సేవలు ప్రజలకు అందించాలని కోరారు. పట్టణంలో చాలామంది గైనకాలజి నిపుణులు మంచి వైద్య సేవలు అందిస్తున్నారని, అన్ని ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరగడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లావణ్య దేవి తల్లిదండ్రులు శ్రీనివాసులు, శివమ్మ,నంద్యాల పట్టణ వైద్యులు పాల్గొని డాక్టర్ లావణ్య దేవికి శుభాకాంక్షలు తెలిపారు.

# అహోబిలంను ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేయండి.!

## -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



ఆంధ్ర ప్రగతి ప్రజల జిల్లా డిసెంబర్ 12:
నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని నల్లమల అరణ్యంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి జన్మస్థలం అహోబిలంను ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను నంద్యాల ఎంపీ, లోక్ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.ఢిల్లీలోని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షేఖావత్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎంపీ శబరి కలిసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రతి ఏటా జరిగే అహోబిలం పారువేట ఉత్సవాన్ని జాతీయ పత్రికల జాబితాలో సంస్కృతీ సంపదగా నమోదు చేయాలని, యునెస్కో ఐ సి హెచ్ గుర్తింపు కోసం అంగీకరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సిఫారసు చేసి వినతి పత్రాన్ని కూడా ఎంపీ శబరి కేంద్ర మంత్రికి అందజేశారు.
“ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రజల యొక్క సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపు కల్పించడమే కాకుండా, ఈ ఉత్సవానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో కూడా సహాయపడుతుందని, యునెస్కో గుర్తింపు వల్ల మా ప్రాంత పర్యాటక అభివృద్ధికి, ప్రజా చైతన్యానికి, స్థానిక కళల సంరక్షణకు పునాదులు వేయవచ్చని కేంద్ర పర్యాటక శాఖ మంత్రికి వివరించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మస్థలం అహోబిలాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ శబరి కోరారు.

# ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు

## -పాల్గొంటున్న 26 జిల్లాల జట్లు






ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 12:
ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో,నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో గురువారం నంద్యాలలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది.
నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాసి నాగ మహేష్ గౌరవ అతిథులుగా పాల్గొని టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెడుతుందని,ఈ క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని అన్నారు.
డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ చదరంగం క్రీడ బాలలలో ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని, నిరంతర సాధన విజయాలకు కీలకమని అన్నారు.
డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఈ పోటీలలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 170 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర సంఘం తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. భవిష్యత్తులో జాతీయస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్ నంద్యాలలో నిర్వహిస్తామని ప్రకటించారు.
నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో వివిధ వయసు కేటగిరీలలో మొదటి పది స్థానాలలో నిలిచిన క్రీడాకారులకు నంద్యాల లయన్స్ క్లబ్ యువజన విభాగం సౌజన్యంతో బహుమతులు అందజేస్తున్నామన్నారు.క్రీడాకారులకు భోజన వసతి బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ఓ ఎస్ డి రాజేష్ సౌజన్యంతో ఏర్పాటు చేశారని తెలిపారు. సభానంతరం డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, డాక్టర్ మధుసూదనరావు చెస్ బోర్డు పై పావులు కలిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ గోవింద జీయర్, జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి,టోర్నమెంట్ పర్యవేక్షురాలు సుజాత, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శులు రాజా చక్రవర్తి,ఇమామ్, కోశాధికారి నాగశ్రీనిష్,లయన్స్ క్లబ్ సభ్యులు రత్నకుమార్ ,సుజిత్ రాఘవ,రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చదరంగం క్రీడాకారులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కోవెలకుంట్ల, బేతంచెర్ల రైలు మార్గంలలో

# అయ్యప్ప స్వామి భక్తులకు 8 ప్రత్యేక రైళ్లు

## -ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 12:
నంద్యాల జిల్లా కేంద్రం మీదుగా బనగానపల్లె, కోవెలకుంట్ల రైలు మార్గంలో 4 ప్రత్యేక రైళ్ళు, పాణ్యం, బేతంచెర్ల, డోన్ రైలు మార్గంలో 4 ప్రత్యేక రైళ్ల అయ్యప్ప మాలాదారణ దీక్ష స్వాములకు శబరిమల వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు మొత్తం 8 ప్రత్యేక రైళ్లు కేంద్ర రైల్వే శాఖ నడుపుతుందని నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం తెలిపారు. నంద్యాల జిల్లా వాసులకు ఇది శుభవార్త అని, గుంటూరు నుండి కొల్లం కు 8 స్పెషల్ రైళ్లు, కొల్లం నుండి నంద్యాల వైపు 8 స్పెషల్ ట్రెయిన్లు నడుపుతున్నారని ఆమె వివరించారు.తన విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ ఈ 8 ప్రత్యేక రైళ్లు నంద్యాల జిల్లా అయ్యప్ప స్వామి భక్తులకు, జిల్లా ప్రజలకు వేశారని, నంద్యాల నుంచి బనగానపల్లె, కోయిలకుంట్ల రూట్లో, నంద్యాల నుంచి పాణ్యం , బేతంచేర్ల, డోన్ మీదుగా డిసెంబర్, జనవరి నెలలో ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయని అయ్యప్ప స్వామి భక్తులు, జిల్లా ప్రజలు ఈ ప్రత్యేక రైళ్ల ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు.
గతంలో ప్రకటించిన 2 స్పెషల్ ట్రెయిన్ లకు రాను పోను టైమింగ్ సరిగ్గా లేవని రైల్వే అధికారులకు తెలిపామని, శబరిమల వెళ్లిన భక్తులకు తిరిగి రావడానికి మరొక ట్రెయిన్ లేకపోవడంతో..ఇప్పుడు ప్రకటించిన స్పెషల్ ట్రెయిన్ లు శబరిమల వెళ్లిన్న భక్తులు మాల విరమించి తరువాత తిరిగి వచ్చే వెసలుబాటు ఉంటుంది అని ఆమె తెలిపారు.

# ఘనంగా 15 వ వార్డు టిడిపి ఇంచార్జ్ ఎబినేజర్ పుట్టినరోజు వేడుకలు



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 12:
నంద్యాల తెలుగుదేశం పార్టీ 15 వ వార్డు ఇంచార్జ్ ఎబినేజర్ పుట్టినరోజు వేడుకలను నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొనడం జరిగింది అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ప్రారంభించడం జరిగింది.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. ఎబినేజర్ గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి విధేయుడుగా ఉంటూ రాష్ట్ర , జిల్లా పిలుపుమేరకు నిర్వహించే కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొంటూ,తెలుగుదేశం పార్టీ అభివృద్ధిలో తన వంతు ప్రాధాన్యత పోషిస్తున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఎబినేజర్ ని ఎల్లవేళలా గౌరవిస్తుందన్నారు . అలాగే ఎబినేజర్ గారు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# గిరిజన పిల్లలంటే అంత చులకనా..?

## -ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్







ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 12:
రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో చదువుతున్న గిరిజన పిల్లలు అంటే ఎందుకు చులకనా అంటూ ప్రభుత్వాని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ నిలదీశారు.
గురువారం విజయవాడ మహానగరంలో ధర్నా చౌక్ నందు గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు భారీ ధర్నా చేపట్టారు. ఆ ధర్నాలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ సంఘీభావం తెలిపి సంపూర్ణ మద్దతు తెలిపారు. గిరిజన పిల్లల భవిష్యత్తు వారు పడుతున్న అవస్థల గురించి మీడియా ముందు ప్రసంగించారు అనంతరం వారు మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 191 పాఠశాల కళాశాలలో 1659 ఉపాధ్యాయులు ఉన్నారని ఆ గురుకులంలో లక్షల మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారి గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వారు మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధ్యాయులు శాంతియుతంగా ధర్నా చేపడుతుంటే బడిలో ఉన్న పిల్లలు పాటలు చెప్పేవారు లేక పనులు మానేసుకొని ఇళ్లకు వెళ్లి కూలీ పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.
గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాబోధన అందించాల్సిన ఉపాధ్యాయులే రోడ్డుకెక్కి తమ కడుపు కోత కోసం ప్రభుత్వాన్ని నిలదీసేందుకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు గురుకుల విద్యాలయాల్లోని అవుట్ సోర్సింగ్ టీచర్లపై కూటమి సర్కార్ మొండి వైఖరి చూపిస్తూ వారి సమస్యను అర్థం చేసుకొని సకాలంలో పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో అర్థం కావడం లేదన్నారు. టీచర్లు వారి బ్రతుకు కొరకు రోడ్డున పడితే గిరిజన విద్యార్థులు చదువు కోసం వారి తరగతులు గదుల్లో టీచర్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారని అన్నారు. 25 రోజులుగా రాష్ట్రంలోని టీచర్లు నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే గిరిజన పిల్లల బ్రతుకులు ఏమై పోతాయో అని ప్రభుత్వం ఎందుకు గ్రహించలేకపోతుందని అన్నారు. గిరిజన సంక్షేమ గురుకులాలకు చెందిన 1656 మంది ఔట్సోర్సింగ్ గిరిజన టీచర్లు సమ్మె చేస్తున్నారు. వారితో చర్చలు జరిపి సానుకూల పరిష్కార మార్గం చూపించి విరమింప చేయాల్సిన ప్రభుత్వం ఎందుకు విరుద్ధంగా మరింత రెచ్చగొట్టే ధోరణిలో ఆవలంబిస్తుందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరి వల్ల గిరిజన సంక్షేమ గురుకులాలతో పాటు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీలు ఎంత చెప్పినా ఏమాత్రం ప్రభుత్వం పట్టించుకోకపోగా గిరిజన విద్యార్థుల పట్ల కనీసం వారి తరగతులు ఎంతవరకు సిలబస్ పూర్తి అయ్యాయో కూడా తెలియకుండా ప్రవర్తించడం గమనార్హమన్నారు. ఇలాగైతే పదవ తరగతి ఎలా ఉత్తీర్ణత సాధిస్తారు అని ప్రశ్నించారు. ఎలాగైనా సరే ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాజు నాయక్ కోరారు. లేనిపక్షంలో విద్యార్థులకు జరిగే నష్టాన్ని పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.

## కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయండి.



ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు డిసెంబర్ 12: ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ ఆరవ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సిపిఐ తాలూకా కార్యదర్శి ప్రతాప్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ బీసన్న మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షురాలు సుశీలమ్మ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 14న గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కాశిరెడ్డి నాయన ఆరాధన.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం డిసెంబర్ 12: ఈనెల 14వ తేదీన రుద్రవరం నల్లమల అటవీ సమీపంలో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కాశిరెడ్డి నాయన ఆరాధన నిర్వహిస్తున్నట్లు దేవస్థానం గౌరవ అధ్యక్షులు గుబ్బ చంద్రశేఖర్, అధ్యక్షులు నల్ల గట్ల వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొల్లం నరసింహులు, కోశాధికారి నలగట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి నల్లగట్ల సుబ్బ నరసయ్య తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆరాధన కార్యక్రమాన్ని పురస్కరించుకుని గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోగణపతి పూజ, కలశ స్థాపన, అభిషేకం, గణపతి హెూమం, లక్ష్మీ గణపతి హెూమం, మహా సుదర్శన హెూమం, లక్ష్మీనరసింహస్వామి హెూమం, నవగ్రహ హెూమం, దత్త హెూమం, ఆవాహిత హెూమం, కోటి దీపోత్సవం, మహా పూర్ణాహుతి, మంగళహారతి తీర్థ ప్రసాదములు నిర్వహించబడునని వారు తెలిపారు. ఈ ఆరాధన కార్యక్రమానికి వచ్చే భక్తులకు భోజన వసతి కల్పించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఆర్ కృష్ణాపురంలో ఆరోగ్యం పై విద్యార్థులకు అవగాహన.



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ డిసెంబర్ 12: బాల బాలికలు సంపూర్ణ ఆరోగ్యం, మెరుగైన విద్య అభ్యసించడం ద్వారా సమగ్ర అభివృద్ధిని పెంపొందించుకోవచ్చని గురువారం ఆర్.కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కార్యక్రమం( ఆర్ కే ఎస్ కే) లో భాగంగా ఆరోగ్య సేవలు, హెల్త్ శానిటేషన్, రక్తహీనత నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత లోపం లో ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందించి రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకౌమార దశ శారీరక మానసిక ఎదుగుదలకు ఆరంభ దశ కాబట్టి వారికి సంపూర్ణ పోషకాహారం అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. రక్తహీనత సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల నివారణ ,మానసిక ఆరోగ్యం, కౌమార దశలో పిల్లల్లో శారీరక మానసిక మార్పులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అతి సారలక్షణాలు కనపడగానే ఓఆర్ఎస్ ద్రావణాన్ని సేవించాలని జింకుమాత్రలు అందించాలన్నారు. అనంతరం పిల్లలకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### :అప్రమత్తంగా ఉండాలన్న హెూంమంత్రి అనిత





అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి: బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కారణంగా రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీనిపై రాష్ట్ర హెూంమంత్రి అనిత స్పందించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అనిత అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లు, కొండచరియలు ఉండే ప్రాంతాల్లో ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక సందేశాలు పంపాలని సూచించారు. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం రాగల 24 గంటల్లో బలహీనపడుతుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది.

# అనర్హుల నుంచి పెన్షన్ రికవరీ చేయండి

### ఏపీలో చాలా మంది అనర్హులకు పెన్షన్ - సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి: ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్ అణుబాంబు పేలేలా కనిపిస్తోంది. ప్రభుత్వం పెన్షన్ విషయంలో చాలా సీరియస్‌గా ఉంది. అనర్హులను పెన్షనర్ల జాబితా నుంచి తొలగించడమే కాదు.. వారికి ఇచ్చిన పెన్షన్ డబ్బులను కూడా వెనక్కి తీసుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో చాలా మంది అనర్హులు పెన్షన్ తీసుకుంటున్నారన్న చంద్రబాబు.. ఇందుకోసం బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చారనీ, ఇలాంటి సర్టిఫికెట్లతో పెన్షనర్లుగా జాబితాలో చేరి, అక్రమంగా పెన్షన్ మనీ పొందుతున్నారని అన్నారు. ఇలాంటి వాళ్లందరి దగ్గరా పెన్షన్ మనీని రికవరీ చెయ్యాలని అధికారులకు చెప్పారు. సీఎం చంద్రబాబు మరో మాట కూడా అన్నారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన డాక్టర్లపై చట్టపరంగా చర్యలు (ప్రాసిక్యూట్) తీసుకోవాలి అని అన్నారు. ప్రత్యేకంగా కొన్ని ఆస్పత్రుల నుంచే బోగస్ సర్టిఫికెట్లు వస్తున్నాయన్న చంద్రబాబు.. అలాంటి ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. మెడికల్ బోర్డుల నుంచి బోగస్ సమర్టిఫికెట్లు ఇస్తున్నారన్న చంద్రబాబు.. ఈ మొత్తం వ్యవస్థను సరిచెయ్యాలని అధికారులను ఆదేశించారు.




ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనర్హులైన పెన్షనర్లను గుర్తిస్తుంది. వారిని పెన్షనర్ల జాబితా నుంచి తొలగిస్తుంది. ఈ కార్యక్రమం మార్చి 31, 2025 నాటికి పూర్తవుతుంది. ఇలా అనర్హులై, బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి పెన్షన్ పొందిన వారిని గుర్తించడమే కాదు.. వారు తిరిగి ఆ పెన్షన్ మనీని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల అనర్హులకు ఇకపై టెన్షన్ తప్పదు. వారు తిరిగి మనీ చెల్లించాలంటే.. వారికి ఎక్కడి నుంచి వస్తుంది? ఇది పెద్ద దుమారం రేగేలా ఉంది. అనర్హులు.. బోగస్ సర్టిఫికెట్లు ఇస్తే.. మరి అధికారులు ఎలా ఆమోదించారు? ఆ సర్టిఫికెట్లను పరిశీలించి, అవి బోగస్‌వి అని ఎందుకు గుర్తించలేదు? అధికారులు చేసిన తప్పు వల్ల.. ఇప్పుడు అనర్హులు పెన్షన్ పొందుతున్నట్లు అవుతోంది. ఇప్పుడు వారి నుంచి మనీ రికవరీ చెయ్యాలని ఆదేశిస్తే, అప్పుడు.. బోగస్ సర్టిఫికెట్లను ఆమోదించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అధికారులు అనర్హులకు పెన్షన్లు ఇచ్చారని కూటమి ప్రభుత్వం అంటోంది. మరి అప్పటి అధికారులు ఎందుకు అనర్హులకు పెన్షన్ ఇచ్చారో, ఎందుకు అనర్హులను, అర్హులుగా గుర్తించారో చెప్పాలి. ఎందుకంటే.. ఇది పెద్ద స్కామ్ లాగా కనిపిస్తోంది. 63 లక్షల మందిలో ఎంత మంది అనర్హులు ఉన్నారో తేలాలి. వారికి ప్రతీ నెలా అక్రమంగా మనీ పోతున్నట్లే. అదంతా ప్రజల డబ్బు. అక్రమంగా, అన్యాయంగా అనర్హులకు ఇవ్వడం సరైనది కాదు. అయితే, అనర్హులను అర్హులుగా చేసిన పాపం అధికారులది. కాబట్టి.. అసలు తప్పంతా అధికారుల దగ్గరే ఉన్నట్లు లెక్క. చర్యలు తీసుకుంటే వారిపై తీసుకోవాలి. ప్రజలపై కాదనే వాదన ఉంది. మొత్తంగా పెన్షన్ల వ్యవహారం ఇప్పుడు ఏపీలో పెను దుమారం రేపుతోంది. జనవరిలో ఎంతమందికి పెన్షన్ వస్తుందో, ఎంతమందికి కట్ అవుతుందో అనేది హాట్ టాపిక్ అయ్యింది.

# రాజధాని అభివృద్ధికి అడుగులు

### ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు

**అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా మార్చేందుకు నిధులు**

**వివిధ బ్యాంకుల నుంచి రూ. 15 వేల కోట్లు రుణాలకు వెసులుబాటు**

**వెసులుబాటు కల్పిస్తూ కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం**

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి: రాజధాని అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు భారీగా నిధులు మంజూరు చేసింది. అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి రుణం మంజూరు చేసినట్టు ఏడీబీ స్పష్టం చేసింది. మొత్తం 121.97 బిలియన్ల జపనీస్ యెన్‌లను మంజూరు చేసినట్టు ఏడీబీ వెల్లడించింది. రాజధాని నిర్మాణానికి నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిధులు సమకూర్చుకునేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో.. వివిధ బ్యాంకుల నుంచి రూ. 15




వేల కోట్లు రుణం తీసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ.. కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం తెలిపింది. రూ. 15,000 కోట్లలో ప్రపంచబ్యాంకు, ఏడీబీ కలిసి రూ. 13,500 కోట్లను రుణంగా ఇస్తున్నాయి. మిగతా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది. రూ. 13,500 కోట్ల రుణాన్ని ఐదేళ్లపాటు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఐదేళ్ల తర్వాత చెల్లింపు మొదలవుతుంది. ఆరు నెలలకు ఒక వాయిదా చొప్పున 23 సంవత్సరాలపాటు రుణం చెల్లించాలి. నిధులతో ప్రభుత్వం కీలక పనులు చేపట్టనుంది. అమరావతి ప్రాంతాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడానికి, ఆ ప్రాంత వాసుల జీవన ప్రమాణాలు పెంచడానికి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు మేలు చేయడానికి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులను ప్రభుత్వం వినియోగించనుంది. ఈ రుణం మంజూరుపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇండియా కంట్రీ డైరెక్టర్ మియో ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులోను మరిన్ని నగరాల అభివృద్ధి జరగబోతోందని.. వాటికి అమరావతి రోల్ మాడల్‌లో మారబోతోందని వ్యాఖ్యానించారు. గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా.. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. పచ్చని ప్రదేశాలు ఉండేలా చూస్తారు. నీరు, పారిశుద్ధ్య సేవలు, తక్కువ కార్బన్ రవాణా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. వరద ప్రమాదాలను తగ్గించడానికి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తారు. పెట్టుబడిదారులను తీసుకురావడంలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తారు. ప్రైవేట్ పెట్టుబడిని సృష్టించి మహిళలు, యువతకు ప్రయోజనం చేకూర్చే కొత్త ఉద్యోగాలను సృష్టిస్తారు.

# చంద్రబాబు గారి అర్ధ సంవత్సర పాలన పూర్తిగా అర్థరహితం: షర్మిల

### ఏపీలో కూటమి పాలనకు ఆర్నెల్లు పూర్తి ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ షర్మిల విమర్శలు ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పుకోవడం సిగ్గుచేటు అంటూ ఫైర్

అమరావతి,డిసెంబర్ 12ఆంధ్ర ప్రగతి: ఏపీలో కూటమి పాలనకు ఆర్నెల్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శనాస్త్రాలు సంధించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతృత్వంలోని చంద్రబాబు గారి అర్ధ సంవత్సర పాలన పూర్తిగా అర్థ రహితమని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలకు ఈ ఆరు నెలల్లో దిక్కులేదు... మేనిఫెస్టోలో పేర్కొన్న 60 హామీలు పత్తా లేవని విమర్శించారు. "సింగిల్ సిలిండర్ తో మమ అనిపించారు. 3 వేల నిరుద్యోగ భృతి ఎక్కడ? 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు... ఇచ్చారా? అని అడుగుతున్నా. చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని పంగనామాలు పెట్టారు. రైతుకు రూ.20 వేలు ఇస్తామంటూ ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకాన్ని దుఃఖీభవ పథకంలా మార్చేశారు. ప్రతి మహిళకు రూ.1500 అన్నారు... ఈ ఆడబిడ్డ నిధి అడ్రస్ లేదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం అన్నారు... ఎప్పట్నించో చెప్పమంటే పండుగలు, పబ్బాలు పేర్లు చెబుతున్నారు. జూన్ 12న తొలి సంతకం డీఎస్సీ ఫైల్ పై పెట్టారు... ఇప్పటికీ నోటిఫికేషన్ కు దిక్కులేదు. ఉచిత ఇసుక పథకంలో ఉచితం కనిపించడంలేదు. చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు మొదటి ఐదేళ్లు అరచేతిలో వైకుంఠం చూపించారు. ఇప్పుడు మళ్లీ



అదే చేతిలో కైలాసం చూపిస్తున్నారు. ఈ ఆరు నెలల్లో రూ.17,500 కోట్ల భారాన్ని జనం నెత్తిన వేశారు. నాణ్యమైన మద్యం అంటూ ధరలు పెంచారు. ఎన్నికల హామీలపై ప్రశ్నిస్తే... రాష్ట్రం వెంటిలేటర్ పై ఉందని చంద్రబాబు ఇప్పటికీ అదే చెబుతున్నారు. వైసీపీ వాళ్లు ఐదేళ్లు అడవి పందుల్లా మేశారని, అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టాలని అంటున్నారు. నిజమే... వైసీపీ వాళ్లది దోపిడీ పాలన, దొంగల పాలన... అందుకే జనాలు బుద్ధి చెప్పారు. మీరేదో ఉద్ధరిస్తారని కదా ప్రజలు మీకు పట్టం కట్టింది... మరి మీరు చేస్తున్నదేమిటి? ఈ ఐదేళ్లూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతూనే ఉంటారా? ఇచ్చిన హామీల గురించి ఆలోచించరా? గత సర్కారు తప్పులను ఎత్తిచూపుతూ ఈ ఆర్నెల్లు కాలయాపన చేశారు. మీ 4.0 ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ ముగిసింది బాబు గారూ! హామీలను అమలు చేయకుండానే, ప్రజలు సంతృప్తిగా ఉన్నారని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేసేలా చూడండి" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.